





జూరాల జలాశయానికి చేరిన నీరు

జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ప్రధాన ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు చేరిన నీరు

అమరచింత, మే 16 : కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి గతనెల తొమ్మిదో తేదీన దిగువకు నీరు వదలడంతో గురువారం ఉదయం జూరాల ప్రాజెక్టుకు 2,451 క్యూసెక్కుల నీరు చేరింది. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద భారీగా నీరు వచ్చి చేరుతోంది. హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉదయమే మూడించుల పైచిలుకు నీరు చేరినట్లు అధికారుల ద్వారా తెలిసింది. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాలువ పక్కనే ఉన్న ప్రాజెక్టు అనుసంధాన కాలువ(ప్యారలల్ కెనాల్) వైపు నీరు భారీగా చేరుతోంది. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 2.909 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ కన్నా రెట్టింపు అంటే 2,451 క్యూసెక్కుల నీరు అదనంగా ప్రాజెక్టుకు చేరింది. మరో 12 గంటల పాటు కర్ణాటక ప్రభుత్వం వదిలిన నీరు ప్రాజెక్టుకు వచ్చే అవకాశం ఉంది. నీటి రాకతో ఈ ప్రాంతంలో ఏర్పడిన తాగునీటి ఇబ్బందులు తీరే అవకాశాలు ఉన్నాయి. జూరాల ఎన్టీఆర్ ఎడమకాలువ లేక అనుసంధాన కెనాల్ ద్వారా తాగునీటి అవసరాల కోసం అధికారులు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కొనసాగుతోందని ప్రాజెక్టు అధికారులు బీచుపల్లి, ఆంజనేయులు తెలిపారు.



జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ వైపు వస్తున్న నీరు

పెరిగిన చెంచుల ఓటింగ్

- చెంచు పెంటల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు
- అధికారుల కృషితో భారీగా పెరిగిన పోలింగ్ శాతం

నాగర్‌కర్నూల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో చెంచులు క్రమంగా ఓటుకు చేరువవుతున్నారు. దశాబ్దాల తరబడి ఓటు హక్కు వినియోగించుకోవడానికి దూరంగా ఉన్న చెంచులు క్రమంగా చేరవవుతుండడం గమనార్హం. ఇందుకు అధికార యంత్రాంగం తీసుకుంటున్న చొరవ కూడా దోహదపడుతోంది. దశాబ్దాల అనంతరం మొట్టమొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న చెంచుల సంఖ్య పెరగడం హర్షణీయం.

ఓటుకు చేరువైన చెంచులు

తెలంగాణలోని నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు పదివేల చెంచు కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు దశాబ్దాలుగా అనేక ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో నల్లమల అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం బలంగా ఉండడంతో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు చెంచుపెంటలకు తీసుకెళ్లడానికి అధికార యంత్రాంగం సాహసించలేదు. అటవీ మార్గాల్లో సరైన రవాణా వసతులు లేకపోవడమూ ఒక కారణమైంది. అప్పాపూర్‌లోని చెంచులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే మన్ననూర్, అచ్చంపేట, తెలకపల్లి మీదుగా లింగాలకు వెళ్లాల్సి వచ్చేది. రాజకీయ పార్టీలు కూడా అప్పట్లో చెంచులను వివిధ రవాణా మార్గాల గుండా పోలింగ్ బూత్‌లకు తరలించే ప్రయత్నాలు చేయలేదు. సహజంగా పట్టణ ప్రాంత వాతావరణం, అక్కడ రాజకీయాల గురించి పెద్దగా పట్టించుకోని చెంచులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి కనబర్చేవారు కాదు.


పెరిగిన ఓటింగ్ శాతం

చెంచులు నివసించే ప్రాంతానికే ఈవీఎంలు తరలివెళ్లడంతో వారు ఓటు వినియోగించుకునే శాతం పెరిగింది. అప్పాపూర్‌లో మొత్తం 127ఓట్లు ఉండగా 71 ఓట్లు పోలయ్యాయి. రామాపూర్ పెంటలో 44 ఓట్లకు గాను 32, భౌరాపూర్‌లో 22ఓట్లకు 17, ఈర్లపెంటలో 75ఓట్లు ఉండగా 40, ఆగర్లపెంటలో 14కు 13, మేడిమలకలలో 41 ఓట్లకు 38, కులాయిపల్లిలో 14 ఓట్లకు 8, సంగడిగుండాలలో 22 ఓట్లకు గాను 18 ఓట్లు పోలయ్యాయి. కొల్లాపూర్‌లోని చెంచుగూడెల్లో కూడా సమీపంగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చెంచులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి కనబర్చారు. కొల్లాపూర్ మండలంలోని చెంచుగూడెల్లో 128 చెంచు కుటుం బాలు నివసిస్తుండగా వీరిలో 320 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా చెంచుగూడెంలోని నివసిస్తున్నందున వారికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కొల్లాపూర్ మండలంలోని అమరగిరి చెంచుగూడెంలో కూడా ఆడవి బిడ్డలు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

నల్లమలలోని పెద్దూటిలో నివసించే చెంచుల కోసం మొలచింతలపల్లి చెంచుగూడెలకు అరకిలో మీటరులోని సమీప ప్రాంతంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో వారు కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. లచ్చునాయక్ తండా చెంచు గూడెంలో 69 కుటుంబాలు నివసిస్తుండగా 106 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కాగా పెద్దకొత్తపల్లి మండలంలో 76 చెంచు కుటుంబాలు ఉండగా 130 మంది ఓటర్లున్నారు. వీరంతా మారేడుమానుదిన్నె, దేవినేనిపల్లి, తీర్నాంపల్లి, యాపట్ల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలల్లో మొదటిసారి ఓటు వేశారు.



రాయలేటిపెంటలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న చెంచు మహిళ



నల్లమలలోని ఆగర్లపెంటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం చెంచులతో అధికారులు

ఖరీఫ్ కష్టమే?

- సాగుకు ముందుకు రాని రైతులు
- ఇంకా తెగని కౌలు ధరలు
- గోదాముల్లోనే మిర్చి పంట
- పెట్టుబడికి రైతు చేతిలో డబ్బు లేదు

అలంపూర్ చౌరస్తా, మే 16 : ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట సాగుచేసేందుకు రైతులు సిద్ధంగా లేనట్లే కనిపిస్తున్నది. వ్యవసాయ ఖర్చులు భరించలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు తృణధాన్యాలు పండించే సమయంలో వ్యవసాయ ఖర్చులు చాలా తక్కువగా ఉండేవి. కానీ నేటి కాలంలో వ్యవసాయం అంటేనే జూదం ఆడినట్లు అవుతున్నది. పదేళ్లకాలంలో కమర్షియల్ పంటలైన మిర్చి, పత్తి సాగువైపు మొగ్గు చూపడంతో ఖర్చులు పెరిగాయి.

తగ్గుతున్న దిగుబడి..

నడిగడ్డ ప్రాంతమైన గద్వాల, ధరూరు, కేటీదొడ్డి, గట్టు, మల్దకల్, అయిజ మండలాల్లో వరి, వేరు శనగ, కంది, మొక్కజొన్న, ఆముదాలు, పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తారు. జిల్లాలో దక్షిణం వైపు ఉన్న ఇటిక్యాల, వడ్డేపల్లి, రాజోలి, మానవపాడు, అలంపూర్, ఉండవల్లి మండలాల్లో అక్కడక్కడ వరితో పాటు అధికంగా మిర్చి, పత్తి, మొక్కజొన్న, కంది, పప్పు శనగ, ఇటీవల పొగాకు పంట సాగు చేస్తున్నారు. రాజోలి, వడ్డేపల్లి మండలాల్లో అక్కడక్కడా రెండో పంటగా వేరుశనగ, ఎర్రజొన్నలు కూడా పండిస్తున్నారు. జిల్లాలో ఈ పంటలు సాగుచేసే వారిలో దాదాపు 80శాతం మంది కౌలు రైతులే కావడం విశేషం. 2022-23లో మిరప, పత్తి పంటకు డిమాండ్ పెరగడంతో కౌలురైతులు భూములు కౌలుకు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఇదే అదునుగా భావించిన భూ యాజమానులు కౌలు ధరలు విపరీతంగా పెంచారు. ఇది కూడా సాగులో ఖర్చు పెరగడానికి ఒక కారణం అవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది సుమారు 1.70లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇందులో 1.25 లక్షల్లో కౌలు రైతులే ఉన్నారు. గతేడాది ఎకరం పొలం రూ.30వేల నుంచి రూ.60వేల దాకా వెచ్చించి మిరప పంటను సాగు చేశారు. చీడపీడల నుంచి పంటలను కాపాడుకునేందుకు మిర్చిరైతులు ప్రతీ రెండు రోజులకు ఒకసారి మందులను పిచికారి చేయాల్సి వస్తుంది. దీంతో ఎకరానికి లక్ష నుంచి లక్షన్నరదాకా ఖర్చు చేశారు. అయినా చివరికి నిరాశే మిగిలింది. వర్షభావ పరిస్థితుల వలన దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పత్తి, మొక్కజొన్న, జొన్న రైతులు లాభాలు చూడకపోయినా నష్టాల నుంచి బయటపడ్డారు. ఇందులో తీవ్రంగా నష్టపోయింది మాత్రం మిర్చిరైతులే. మిర్చి ధరలు తగ్గడంతో భవిష్యత్‌లో ధరలు పెరుగుతాయన్న ఆశతో పండిన పంటను కుడా కోల్డ్‌స్టోరేజీలలో నిలువ ఉంచుకున్నారు. రెండు నెలలు దాటిన ధరల్లో మాత్రం మార్పు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఖరీఫ్ సమీపిస్తున్నా గతేడాది వేసిన పంటను తొలగించని రైతులు

ఖరీఫ్ ఎలా..? ..

జూన్ మాసంలో ఖరీఫ్ మొదలవుతుంది. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తి చేయాల్సింది. కానీ చాలా మంది రైతులు పొలం వైపు వెళ్లడంలేదు. నిలువ ఉంచిన మిర్చి పంటను అమ్మితేగాని రైతు చేతిలో నగదు ఉండదు. కౌలు రైతుల వద్ద డబ్బు లేకపోవడంతో సాగుపై ఆసక్తి చూపడంలేదు. గతేడాది చేసిన అప్పులే తీర్చుకోలేదు.. మళ్లీ ఈ ఏడాది పెట్టుబడికి అప్పు ఎలా పుడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు రైతుబంధు అమలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆహార ధాన్యాలు పండించాలి

ప్రస్తుతం కమర్షియల్ పంటలకు ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆ వైపు వెళ్లడం మానుకోవాలి. ఆహార ధాన్యాలు పండించాలి. దీనివల్ల ఖర్చులు తగ్గుతాయి, భూ సాంద్రత పెరుగుతుంది, రసాయన ఎరువుల మందు ఖర్చులు కూడా తగ్గుతాయి. దీని వల్ల రైతులకు అప్పు భారం తగ్గుతుంది. ఒక వేళ కమర్షియల్ పంట సాగుచేసిన తక్కువ విస్తీర్ణంలో సాగుచేసుకోవాలి.

- గోవిందునాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వాలి



గతేడాది మిర్చి పంటకు డిమాండ్ ఉండటంతో ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో పంటసాగు చేశాను. ఎకరానికి లక్షన్నరదాక పెట్టుబడి పెట్టాను. తీరా చూస్తే ఎకరంలో నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పైగా ధరలు లేకపోవడంతో గోదాముల్లో నిలువ ఉంచాను. ఈ సీజన్‌లో పంట సాగుచేసేందుకు పెట్టుబడికి డబ్బు లు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు బంధు ఇచ్చి ఆదుకోవాలి.

- వెంకటేశ్వర్లు, కౌలురైతు

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

- స్నేహ పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తుండగా ఘటన



నరసింహ (ఫైల్)

పెబ్బేరు రూరల్, మే 16 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామ సమీపంలో ఉన్న స్నేహ పౌల్ట్రీఫాంలో ఎలక్ట్రీషియన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బంగి నరింహ(35) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన నరసింహ స్నేహ పౌల్ట్రీఫాంలో ఎలక్ట్రీషియన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ భార్యతో పాటు, పౌల్ట్రీఫాంకు చెందిన క్వార్టర్స్‌లో నివసిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పౌల్ట్రీఫాంలో కరెంటు పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదంటూ మృతుడి భార్య గురువారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం బోల్తా, కూలీలకు గాయాలు

అయిజ టౌన్, మే 16 : ఆటో బోల్తా పడి పలువురు కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని కాలమ్మ పేటకు చెందిన కూలీలు గురువారం ఉదయం పొలం పనుల కోసం ట్రాలీ (మహేంద్ర బొలెరో)లో బయలుదేరారు. కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో 30 మంది కూలీలు ఉండటంతో ఒకరిమీద ఒకరు పడిపోయారు. వారిలో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ట్రాలీలో సామర్థ్యానికి మించి కూలీలను ఎక్కించుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు.


జంప్ జిలానీలతో మారిన రాజకీయం

- పేట మునిసిపాలిటీలో హస్తం పైచేయి - మారిన పేట మునిసిపల్ ముఖచిత్రం



పేట మునిసిపల్ కార్యాలయం

నారాయణపేట, మే 16 : నారాయణపేట మునిసిపాలిటీలో జంప్ జిలానీలతో రాజకీయం మారింది. నారాయణపేట మునిసిపాలిటీ పీఠాన్ని 2020 జనవరి 23న బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. 24 వార్డులకు గాను బీఆర్ఎస్ 10 మంది కౌన్సిలర్లు, బీజేపీ 9, కాంగ్రెస్ ఇద్దరు, ఎంఐఎం ఒక్కరు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. స్వతంత్రంగా గెలుపొందిన ఇద్దరు కౌన్సిలర్లు ఒకరు బీఆర్ఎస్‌లో చేరగా, మరొకరు ఎంఐఎంలో చేరారు. కాంగ్రెస్ ఇద్దరు, ఎంఐఎం, ఇండిపెండెంట్ ఇద్దరు కౌన్సిలర్ల మద్దతుతో బీఆర్ఎస్ పాలకవర్గం కొలువుదీరింది. చైర్‌పర్సన్‌గా గందె అనసూయ, వైస్‌చైర్మన్‌గా హరినారాయణ్‌భట్టడ్ బాధ్యతలు చేపట్టారు. మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ కౌన్సిలర్ సరిత బీఆర్ఎస్ గూటికి చేరగా, ఒకే ఒక కౌన్సిలర్ సలీం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల మధ్య విభేదాలతో వైస్ చైర్మన్ కాంగ్రెస్ గూటికి చేరారు. వైస్ చైర్మన్‌తో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మహేష్, సరిత, అమిరుద్దీన్, బండిరాజేశ్వరి, జొన్నల అనిత, నారాయణమ్మ, వరలక్ష్మి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇటీవలే మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ కూడా హస్తం గూటికి చేరడంతో కాంగ్రెస్ బలం పెరిగింది. 10వ వార్డుకు చెందిన మేఘన శ్రీపాద్ బీఆర్ఎస్ నుంచి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరింది. దీంతో ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కేవలం ఇద్దరు కౌన్సిలర్లు గురులింగం, శిరీష మిగిలారు. మునిసిపాలిటీలో ప్రస్తుతం 24 స్థానాలకు గాను కాంగ్రెస్ 10 స్థానాలు, బీజేపీ 10 స్థానాలు, ఎంఐఎం 2 స్థానాలు, బీఆర్ఎస్ 2 స్థానాలు ఉన్నాయి. ఎంఐఎం, ఎమ్మెల్యే మద్దతుతో పేట మునిసిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం లేకపోలేదు.
కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల మధ్య ఏ మేరకు సయోధ్య కుదురుతుందో వేచి చూడాలి. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డిలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో నని పట్టణ ప్రజలు జర్చించుకుంటున్నారు.



నారాయణపేట పట్టణం

కల్వకుర్తిలో.. భారీ వర్షం

- వెల్దండ మండలం పెద్దాపూర్‌లో పిడుగుపడి కాడెద్దు..
- కల్వకుర్తిలో విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి
- ఉమ్మడి జిల్లాలో చల్లబడ్డ వాతావరణం


కల్వకుర్తి/వెల్దండ/మహబూబ్‌నగర్/వనపర్తి/ భూత్పూర్/ రాజాపూర్/ హన్వాడ మే 16 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలు చోట్ల గురువారం మొస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గాలి వానకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో ఇళ్లపై కప్పు రేకులు లేచిపోయాయి. పిడుగు పడి ఎద్దులు మృతి చెందాయి. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాన్ని తగిలి వ్యక్తి మృతి చెందాడు. వనపర్తిలో ఆరబోసిన ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రాంతంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రోడ్లు జలమ యమయ్యాయి. ఎల్లికల్ రోడ్డులో మురుగు నీరు కల్వర్టుపై నుంచి పారడంతో రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ అనే రైతులకు చెందిన కాడెద్దులు పిడుగుపడి మృతి చెందాయి. కల్వకుర్తి పట్టణం లోని ఇందిరానగర్‌కు చెందిన రాము(22) నాగర్ కర్నూల్ రోడ్డులోని వైన్‌షాపు సమీపంలో కరెంటు స్తంభానికి తగలి మృతి చెందాడు. పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో మొస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. భారీ వర్షానికి భూత్పూర్ చౌరస్తాలో నీరు నిలిచింది. ఈదురు గాలులతో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. ఇళ్ల, షెడ్లకు ఉన్న రేకులు ఎగిరిపోయాయి. హన్వాడ, మిడ్జిల్ మండలాల్లో మొస్తరు వర్షం కురిసింది. గండీడ్ మండలంలోని రుసుంపల్లి గ్రామంలో విద్యుత్ తీగలపై తాటి చెట్టు పడింది. రాజాపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో కల్లాల్లో ఉంచిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. మిడ్జిల్ మండలంలో 2 సెంటీ మీటర్ల మేర వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా అంతటా 40 డిగ్రీలలోపే ఉష్ణోగ్రత నమోదైంది. సీసీకుంటలో అత్యధికంగా 39.9, మూసాపేటలో 39.8, అడ్డాకులలో 39.4, భూత్పూర్‌లో 39.3 డిగ్రీలు నమోదుకాగా, జిల్లాలో అత్యల్పంగా రాజాపూర్‌లో 35.8 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, మదనాపూర్, కొత్తకోట, అమరచింత, ఖిల్లాఘణపురం ప్రాంతాలలో తేలికపాటి వర్షం కురిసింది.



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు



కల్వకుర్తి బస్టాండు వద్ద కురుస్తున్న వర్షం



వెల్దండలో కురుస్తున్న వర్షం



విద్యుత్ స్తంభానికి తగిలి మృతి చెందిన రాము(ఫైల్)



రుసుంపల్లిలో విద్యుత్ తీగలపై పడ్డ తాటి చెట్టు



బ్యాంకు ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లో

రూ.1,06,850 నగదు స్వాహా

ఖిల్లాఘణపురం, మే 16 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగి కుర్వ పూల శేషయ్య బ్యాంకు ఖాతాలో రూ.1,06,850 నగదును గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో చోరీ చేశారు.

బాధితుడు శేషయ్య మాట్లాడుతూ ఈనెల ఏడో తేదీన తన ఏపీజీవీబీ ఖాతాలో రూ.లక్షా 54 వేల నగదు ఉండగా మొదట రూ.45వేలు ఆవెంటనే రూ.48,350 నగదుతో మొత్తం రూ.93,350లను గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాలోకి వెళ్లాయని వాపోయారు. ఆన్‌లైన్‌లో నగదు చోరీ జరిగినట్లు గుర్తించి మిగిలిన డబ్బులను వేరే అకౌంట్లోకి మార్చుకున్నట్లు తెలిపారు. మళ్లీ ఈనెల 13వ తేదీన తన యూనియన్ బ్యాంకు ఖాతాలో రూ.13,500లను ఆన్‌లైన్ ద్వారా చోరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ హ్యాక్ చేసి పథకం ప్రకారం నగదును బదిలీ చేసుకున్నారని వివరించారు. రెండు బ్యాంకు ఖాతాలకు ఒకే నెంబర్ అనుసంధానం చేసి ఉండడంతో నగదు బదిలీ జరిగిందని అన్నారు. నగదు చోరీపై గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, చోరీ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని డబ్బులు రికవరీ చేయించాలని పోలీసులను కోరారు.

ఈ విషయంపై ఎస్సై శ్రీహరిని వివరణ కోరగా ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా సైబర్ నేరగాళ్లు చోరీకి పాల్పడతారని, ఖాతాదారులు ఆన్‌లైన్ అకౌంట్లపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా, బ్యాంకు ఖాతా విషయంలో అపరిచితులకు వివరాలు చెప్పొద్దని, క్షణాల్లో ఖాతాల నుంచి డబ్బులు మాయం చేస్తారని పేర్కొన్నారు.

బీడీ కార్మికుల చర్చలు వాయిదా

అమరచింత, మే 16 : బీడీ కార్మికుల కనీస వేతనం పెంచాలని గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఫ్యాక్టరీ యాజమాన్యంతో బీడీ కార్మిక సంఘాల నాయకుల నిర్వహించిన చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి. ముఖ్యంగా ఈ చర్చల్లో పీఎఫ్ 4 రూపాయలు, వేయి బీడీలకు రూ.16 మాత్రమే పెంచుతామని యాజమాన్యం తేల్చి చెప్పడంతో కార్మిక సంఘం నాయకులు ఒప్పుకోలేదు. దీంతో యాజమాన్యం ఈనెల 27వ తేదీకి చర్చలను వాయిదా వేసింది. చర్చల్లో బీడీ ఫ్యాక్టరీ యాజమానులు సుధాకర్ రెడ్డి, సోహెల్ సెట్, జియా సెట్, వాసిమ్ సెట్, వాజిర్‌బాబు, ఆఖిఫ్‌సేట్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు సూర్యం, మహమూద్, దేవదానం, కోళ్ల వెంకటన్న, అబ్రహం, కొండన్న, సామెల్, అరుణ్‌కుమార్, వేణుగోపాల్, మోష, శ్యాంసుందర్, యాదగిరి, ఖలీల్, దాసు, బాలరాజు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో బీడీ ఫ్యాక్టరీ యజమానులతో చర్చలు జరుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

- ట్యాంక్‌బండ్‌పై ఘటన
- మృతుడు కొల్లాపూర్ వాసి
- కేసు నమోదు చేసిన దోమలగూడ పోలీసులు

కవాడిగుడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్ బండ్‌పై వేగంగా వెళుతున్న ఓ కారు.. పల్సర్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన ఎం.కార్తీక్(21) అనే యువకుడు హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కార్తీక్ తన పల్సర్ బైక్‌పై యూసుఫ్‌గూడ నుంచి అంబర్‌పేటకు వెళ్తున్న క్రమంలో ట్యాంక్ బండ్ పైకి రాగానే దారితప్పి, సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా.. సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న కారు ట్యాంక్‌బండ్ పైనున్న విజయ్ ఐస్‌క్రీమ్ పార్లర్ వద్ద కార్తీక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కార్తీక్‌ను సమీపంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, కార్తీక్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతుడు కార్తీక్ బైక్ వెనకాల ఉన్న మధుకు స్వల్ప గాయాలు కావడంతో గాంధీ ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కార్ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు.

వర్షపు జల్లులతో రైతుల ఇబ్బందులు

రేవల్లి, మే 16 : గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు, ఆరబోసిన ధాన్యం అనుకోకుండా కురుస్తున్న వర్షపు జల్లులకు తడుస్తున్నది. గత నాలుగైదు రోజుల నుంచి అప్పుడప్పుడు వస్తున్న వర్షం జల్లుల వల్ల ధాన్యంపై కొంతమంది రైతులు కవర్లు కప్పి అలాగే ఉంచారు. కష్టపడి పండించిన పంట పాడవుతోందని, వడ్లు ఆరబెట్టడానికి వీలు కావడం లేదని, ధాన్యం ఆరకపోతే కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని తలుపునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో గత మూడు, నాలుగు రోజుల నుంచి ధాన్యపు కుప్పలు అలాగే ఉన్నాయి. వడ్లు ఎండకపోవడంతో ఎవరూ కొనుగోలు చేయడం లేదు.


కొనుగోలు కేంద్రంలోని ధాన్యం

వృథాగా భగీరథ నీరు.. పట్టించుకోని అధికారులు


వాటర్ ట్యాంకు కింద పైపులైను ద్వారా బయటికి పారుతున్న నీరు

అమరచింత, మే 16 : అసలే వేసవికాలం.. ఆపై నీటి కష్టాలు.. ఈ సమయంలోనే వృథాగా నీరు.. ఇదీ మిషన్ భగీరథ తీరు. గురువారం మండల కేంద్రంలోని నాగల్‌కడుమూర్ రహదారిలో ఉన్న మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంకు కింద పైపులైన్ ద్వారా నీరు గంటల పాటు వృథాగా పారుతున్నా సంబంధిత శాఖ అధికారులెవరూ పట్టించుకోలేదు. అమరచింతతో పాటు, చాలా గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా నీటి వృథా కొనసాగుతూనే ఉంటుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వృథాగా పారే నీటిపై దృష్టి సారించాలని పలువురు పేర్కొంటున్నారు.


వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత

- వనపర్తి జిల్లాలో జోరుగా మట్టి దందా
- ప్రభుత్వ భూములు, గుట్టలే టార్గెట్
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- కనుమరుగవుతున్న గుట్టలు



రాజనగరం గుట్ట వద్ద మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతలు

వనపర్తి అర్బన్, మే 16 : అక్రమార్కుల ధన దాహానికి ప్రకృతి వనరులు కరిగిపోతు న్నాయి. కొండలు, గుట్టలు మాయమవుతున్నాయి. పట్టా భూములు, ప్రభుత్వ భూములు, గుట్టలు అనే తేడా లేకుండా తవ్విపోస్తున్నారు. వనపర్తి జిల్లాలో ప్రభుత్వ భూములు, గుట్టలే టార్గెట్‌గా కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి దందా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రాజకీయ పలుకుబడితో అధికారులకు ముడుపులు ఇచ్చి ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రతీనిత్యం అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతున్నా ఆ వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని వనపర్తి, పెద్దేరు, శ్రీరంగాపూర్, గోపాల్‌పేట, కొత్తకోట మండలాల్లో గుట్టల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లలో మట్టిని తోడి తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ మండలాల్లోని గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి వేలాది సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించారు. అక్రమార్కులు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు, కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికి మట్టి డిమాండ్ బాగా ఏర్పడుతోంది. మట్టి అవసరం ఉన్న వాళ్లు ఒక టిప్పర్‌కు రూ.2వేల నుంచి రూ.8వేల వరకు, ట్రాక్టర్ రూ.800 నుంచి రూ.1200 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ మట్టిని తరలించాలంటే మైనింగ్ శాఖ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. కానీ అక్రమార్కులు ఇవేమీ పట్టించు కోవడం లేదు.

గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఇంతే

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు చేసిన అప్పటి ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మట్టి దందాపై కనీసం నోరు కూడా ఎత్తడం లేదు. గతంలో రాజకీయ పలుకుబడి ఉపయోగించి మట్టి దందా నిర్వహించిన వారు, మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీలోకి వచ్చి ఈ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అక్రమార్కులు ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తుంటే వెంటనే స్థానికులు, అక్కడ ఉన్నవారు ఎవరైనా పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే ఆ దందా నిర్వహించే నాయకుడికి వీరే ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారు. ప్రధానంగా ఈ తతంగమంతా మైనింగ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ప్రధాన మైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రకృతి కోసం ప్రభుత్వం వందల కోట్ల ఖర్చు

ప్రకృతిని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వాలు ప్రతీఏటా కోట్లల్లో ఖర్చు పెట్టి హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. కానీ అక్రమార్కులు మాత్రం ప్రకృతి సంపదను దోచుకుంటూ నాశనం చేస్తున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఒకవైపు ప్రతీఏటా వర్షాకాలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గుట్టలు, ప్రభుత్వ భూముల్లో హరితహారం మొక్కలు నాటుతుంటే అక్రమార్కులు మట్టిని తరలిస్తు ఆ చెట్లను నేల కూల్చుతున్నారు. ఇప్పటికైనా ప్రకృతి సంపద కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వనపర్తి జిల్లాలోని శ్రీనివాసపురం సమీపంలో మట్టిని తరలించడంతో తరిగిన గుట్ట













ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

పాలమూరు యూనివర్సిటీ, మే 16 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనట్లు పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. 49 సెంటర్లలో రెండవ సెమిస్టర్ పరీక్షలకు 11,848గాను 11,227 పరీక్షలకు హాజరయ్యారని, 621 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు. నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 11,448 గాను 11108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 337మంది గైర్హాజరయ్యారని, మాల్ ప్రాక్టీస్‌లో ముగ్గురు బుక్ అయినట్లు తెలిపారు.

24న విత్తన మేళా

బిజినేపల్లి, మే 16 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 24న విత్తన మేళా నిర్వహించనున్నట్లు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి గురువారం తెలిపారు. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు, నీటి లభ్యతకు అనువైన పంట రకాల నాణ్యమైన విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలను విక్రయించేందుకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు ఈనెల 24న నిర్వహించే విత్తన మేళాకు హాజరుకావాలన్నారు.

ఓటు వేసేందుకు వెళ్లి మహిళ అదృశ్యం

రాజోలి, మే 16 : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని ఉప్పల గ్రామానికి చెందిన కుర్వ మహేశ్వరి (31) ఈ నెల 13న ఓటు వేసేందుకు రాజోలికి వెళ్లి, ఇంటికి తిరిగిరాలేదు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలం, ఉప్పల గ్రామానికి చెందిన కుర్వ మహేశ్వరి (31), రాజోలికి చెందిన కుర్వ సుధాకర్ భార్యాభర్తలు. భర్త తనను సక్రమంగా చూసుకోవడం లేదని ఆమె తన పుట్టినిల్లు ఉప్పల గ్రామంలో ఉంటోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సోమవారం ఆమె రాజోలికి వెళ్లింది. ఓటు వేసిన అనంతరం ఆటో ఎక్కి వెళ్లిపోయింది. కానీ ఆమె అటు ఉప్పలలోని పుట్టినింటికి, ఇటు రాజోలిలోని అత్తగారింటికి చేరుకోలేదు. దీంతో ఆమె భర్త సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

అమరచింత, మే 16 : మరో పది రోజుల్లో ఆ యువతి వివాహం. తన వివాహం తల్లికి భారం అవుతుందని మనస్తాపం చెందిన ఆ యువతి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన షరీఫ్, అభిల ఏకైక కూతురు ఖాజాబీ(22). డిగ్రీ వరకు పూర్తి చేసిన ఖాజాబీ తల్లి, సోదరుడితో పాటు వ్యవసాయ కూలీ పనులు చేస్తు జీవనం కొనసాగిస్తోంది. గత నెల ఆత్మకూరు మండలం మోట్లంపల్లి గ్రామంలోని ఓ వ్యక్తితో ఖాజాబీ వివాహం జరిపించడానికి పెద్దలు నిశ్చయించారు. మరో పది రోజుల్లో పెళ్లి కూడా ఖాయం చేశారు. తల్లి వ్యవసాయ పనులు చేస్తు తన పెళ్లి కోసం వరకట్నంగా బైకు, బంగారం, పెళ్లి ఖర్చులు కలిపి రూ.ఐదు లక్షలు భారమవుతుందని ఖాజాబీ మదనపడుతూ ఉండేది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా ఆమె బరువుకు చున్ని తెగి తల బండకు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. యువతి తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. మరో పది రోజుల్లో వివాహం కోసం సిద్ధం చేస్తున్న వారి బంధువులు, కుటుంబీకులు రోదనలతో పలువురిని కంటతడి పెట్టించింది.

పురుగుల మందు తాగి మహిళ..

కొల్లాపూర్, మే 16 : కొల్లాపూర్ పట్టణంలోని బుడగజంగాల కాలనీలో పురుగుల మందు తాగి మహిళ మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన నర్సమ్మ(35) భర్త మశన్న బుధవారం సాయంత్రం కాలనీలో నెలకొన్న వివాదాల కారణంగా మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి మృతి చెందింది. మృతురాలి బావ ఫకీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రిషికేష్ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృష్ణ, మే 16 : అనుమానాస్పద స్థితిలో ఓ మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులోని వ్యవసాయ పొలం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నవీద్ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా జెగర్‌నగర్ గ్రామానికి చెందిన బళ్లారి దండు మహదేవ్(43) అని తెలిసింది. ఇతనికి 2004లో సునీత అనే అమ్మాయితో వివాహం కాగా, ఒక కొడుకు, ఒక కూతురు సంతానం. దాదాపు పది సంవత్సరాల నుంచి మహేదవ్ ఇంట్లో గొడవల వల్ల ఒక్కడే అమ్మతో కలిసి మల్లాపూర్ గ్రామంలో ఉంటున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై రోజు తాగేవాడు. వారం క్రితం మహదేవ్ గుడెబల్లూరు శివారుకు కల్లు తాగడానికి వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి అన్న తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

భూత్పూర్, మే 16 : ఓ వైపు అనారోగ్య సమస్యలు, మరోవైపు అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన బోడ మహేష్(27) కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వృత్తిరీత్యా మహేష్ గ్రామంలో లేడిస్ కార్నర్ దుకాణం నడుపుతున్నాడు. మహేష్‌కు కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఈ తరుణంలో ఆరోగ్యం బాగు చేయించుకోవడానికి అప్పు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో తరచూ నిద్రపోకుండా బాధపడుతుండేవాడు. ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి మహేష్ బయటికి వెళ్లివస్తానని భార్య భాగ్యలక్ష్మికి చెప్పి వెళ్లాడు. రాత్రి అయిన ఆ రోజు తిరిగి ఇంటి రాలేదు. మహేష్ ఆచూకీ లభించకపోవడంతో గురువారం మహేష్ భార్య బాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, మే 16 : జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయమ్మ ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడంలేదని ఎస్ఐ చంద్రమోహన్‌రావు గురువారం తెలిపారు. ఆమె మనుమడు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 10వ తేదీన సాయమ్మ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో సాయమ్మ ఆచూకీ కోసం చుట్టు పక్కల వారిని, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి సమాచారం రాకపోవడంతో గురువారం సాయమ్మ మనుమడు శ్రీశైలం తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా సాయమ్మకు మతిస్థిమితం సక్రమంగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఇంటి నుంచి సాయమ్మ వెళ్లేటప్పుడు పసుపు కలర్ చీర, ఎర్రటి రంగులో ఉన్న జాకెట్ ధరించి ఉందని తెలిపారు. పై అనవాళ్లతో ఉన్న వృద్ధురాలు ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా



బోల్తా పడిన బొలేరో వాహనం

మిడ్జిల్, మే 16 : మండలంలోని వాడ్యాల, మిడ్జిల్ గ్రామాల మధ్యన బొలెరో వాహనం గురువారం బోల్తా పడింది. వాడ్యాల గ్రామ బస్‌స్టేజీ నుంచి మిడ్జిల్ వైపు వస్తున్న బొలెరో వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఎడమ పక్కన ఉన్న బొలెరో వాహనం కుడిపక్కకు ఒక్కసారిగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడినట్లు తెలిపారు. బైక్‌పై వెళ్లేవారికి త్రుటిలో ప్రమాదం తప్పిందని, బొలెరోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ శంకర్, రమేష్‌లకు స్వల్పంగా గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ, మే 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం సంజాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల శ్రీహరి (35) తన సోదరి గ్రామమైన ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్న క్రమంలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై కాటన్ మిల్లు వద్ద ఈ నెల 14న ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

వాలీబాల్ అకాడమీకి

మోక్షమెప్పుడో

▸▸ ఏడాదిగా ఎదురు చూస్తున్న విద్యార్థులు ▸▸ విద్యా సంవత్సరం ముగిసినా దక్కని మోక్షం





వాలీబాల్ అకాడమీ కోసం ఏర్పాటు చేసిన మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు



అకాడమీ విద్యార్థుల వసతి కోసం సిద్ధం చేసిన గదులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 16 : మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో ప్రతిష్ఠాత్మక వాలీబాల్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అకాడమీలో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయి ఎంపిక ప్రక్రియ కూడా మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన 20 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. అకాడమీలో చేరేందుకు తమకు పిలుపువస్తుందని వారంతా కొన్ని నెలలుగా ఎదురుచేస్తున్నారు. ఏడాది దాటిఆ అకాడమీ ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. కొత్త ప్రభుత్వంలోనై నా ఈ అకాడమీ ప్రారంభోత్స వానికి చర్యలు చేపట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, క్రీడాకారులు కోరుతున్నారు.

వంట సామగ్రి, బెడ్లు సిద్ధం

వాలీబాల్ అకాడమీకి అవసరమైన మౌలిక సామగ్రి కోసం గడేదాది చివరల్లో డీఎస్ఏ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్)కు ప్రతిపాదనలు పంపించింది. ఆ మేరకు రూ.3.70 లక్షల విలువైన వంట సామగ్రి స్టేడియానికి చేరింది. రూ. మూడు లక్షలకుపై చిలుకు నిధులతో 40 ఇనుప మంచాలు వచ్చాయి. వాటిపై వేసేందుకు పరుపులు, బ్లాంకెట్ తదితరాలు రావాల్సి ఉంది. డైనింగ్ టేబుళ్లు రావాల్సి ఉంది. భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టు ఇచ్చేందుకు ప్రక్రియ పట్టా లెక్కాల్సి ఉంది. పిల్లలకు మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అందించే పౌష్టికాహారం తదితరాలకు కాంట్రాక్టర్ కోసం జిల్లాలో అన్వేషిస్తున్నట్లు సమాచారం. బాల, బాలికలకు ప్రత్యేక కోచ్‌లను నియమించాల్సి ఉంది. ఈ ప్రక్రియను ఈ విద్యా సంవత్సరంలో చేపడితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందనుకున్నా సాధ్యం కాలేదు. ఇప్పటికే విద్యా సంవత్సరం ముగిసి వేసవి సెలవులు ప్రారంభయ్యాయి. ఇంటర్, పది పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. అయి నా సాట్స్ నుంచి అకాడమీ ప్రారంభానికి సంకేతాలు లేకపోవటం ఎంపికైన క్రీడాకారులు ఆందోళనకు గురవుతున్నారు.

రూ.19 లక్షలతో వసతులు

వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) ద్వారా రూ.19 లక్ష ల వరకు నిధులు విడుదల చేసింది. వాటితో మైదానం లో రెండు వాలీబాల్ కోర్టులు సిద్ధం చేశారు. ప్లే ఫీల్డు గోడలకు చిత్రాలు కూడా వేశారు. క్రీడాకారులకు వసతి కల్పించేందుకు ఈత కొలను పైఅంతస్తులోని గదులకు మరమ్మతులు చేశారు. బండలు వేసి పెయింటింగ్ వేసి రూంలను సిద్ధం చేశారు.

శాట్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



వాలీబాల్ అకాడమీ ప్రారంభం కాని విషయాన్ని శాట్స్ దృష్టికి తీసువెళ్తాం. ఇక్కడ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన సదుపాయాలు కల్పిస్తే ఎంపికైన క్రీడాకారులతో వాలీబాల్ అకాడమీ ప్రారంభిస్తాం. ఇద్దరు కోచ్‌లు, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. గతంలో ఎంపికైన వారితో పాటు మరోసారి కొత్త వారికి అవకాశం కల్పించి ఎంపికలు చేపడతాం.

- ఎస్.శ్రీనివాస్ డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

నర్సంపల్లి వాసికి డాక్టరేట్



విజయ్‌కుమార్‌గౌడ్‌కు డాక్టరేట్ అందిస్తున్న పీయూ ఉప కులపతి ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

ఊర్కొండ/పాలమూరు యూనివర్సిటీ, మే 16: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో వనపర్తి పీజీ సెంటర్ మైక్రో బయాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వాగుల్ దాస్ విజయ్ కుమార్ గౌడ్‌కు గురువారం పాలమూరు విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విభాగం నుంచి అత్యున్నత డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. వాగుల్ దాస్ విజయ్ కుమార్ గౌడ్ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. విజయ్ కుమార్ ప్రాథమిక విద్యను నర్సంపల్లి లో హై స్కూల్ విద్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊర్కొండపేట, ఇంటర్మీడియట్ ఉషోదయ జూనియర్ కాలేజీ కల్వకుర్తి, బీఎస్సీ డాక్టర్ బీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల యందు పూర్తి చేసి ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేసి అధ్యాపక వృత్తిలో 12 సంవత్సరాల అనుభవం గడించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించినటువంటి సెట్ ఎగ్జామినేషన్ పాసై తద్వారా పాలమూరు యూనివర్సిటీ మైక్రో బయాలజీ విభాగం నందు పీహెచ్‌డీ అడ్మిషన్ పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ డి.మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో రెమిడియేషన్ స్టడీస్ ఆన్ ఫిజికో కెమికల్, మైక్రో బయోలాజికల్ అనాలసిస్ ఆఫ్ వాటర్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ పెద్ద చెరువు మహబూబ్‌నగర్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి అత్యున్నత డిగ్రీ అయినటువంటి పీహెచ్‌డీ పొందారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్బీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్టర్ ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజ్ కుమార్ పర్యవేక్షకుడు డాక్టర్ రాజ్ కుమార్, పర్యవేక్షకులు డాక్టర్ డి మధుసూదన్ రెడ్డిలు అభినందించారు. అదే విధంగా డాక్టరేట్ పొందిన విజయ్ కుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు, భార్య సోదరుడు పాండుగౌడ్ లను నర్సంపల్లి గ్రామ పెద్దలు అభినందించారు.

కొల్లాపూర్ పీజీ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గౌరవ డాక్టరేట్



శిరీష

కొల్లాపూర్ : పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శిరీషకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా అందజేసింది. ఏ స్టడీ ఆన్ క్రెడిట్ స్కీమ్స్ ఆఫర్డ్ బై కమర్షియల్ బ్యాంక్ టు మైక్రో అండ్ స్మాల్ ఇంటర్‌ప్రినియర్ విత్ రెస్పెక్ట్ టు ఎరెస్టు వైల్ మహబూబ్‌నగర్ అనే అంశంపై డాక్టర్ వై.జాంగీర్, ప్రొఫెసర్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఉస్మానియా యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శిరీషకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా అందజేసింది. ఈ సందర్భంగా కొల్లాపూర్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కపోలోనియత్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ జి.సంతోష్‌కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీషను అభినందించారు.

భారీ తాచు పాము

▸▸ భయభ్రాంతులకు గురైన ఉపాధి కూలీలు



చనిపోయిన తాచు పాముతో ఉపాధి కూలీ

ఊర్కొండ, మే 16 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ గ్రామంలో గురువారం రైతు పొలంలో ఉపాధి హామీ పథకంలో కూలీలు పనులు చేస్తుండగా తాచు పాము బుసలు కొడుతూ కలకలం రేపింది. దాంతో ఉపాధి కూలీలు భయభ్రాంతులకు గురై పరుగులు పెట్టారు. కొందరు కూలీలు ధైర్యం చేసి కట్టెలతో కొట్టి చంపేశారు. ఉపాధి కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 16: భారత వాయుసేనలో అగ్నివీర్ (ముజీసియన్)గా చేరేందుకు జూన్ 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 1 జనవరి 2004 నుంచి 2 జూలై 2007 మధ్య జన్మించి ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై సంగీతం సర్టిఫికెట్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్దేశించిన తేదీలోగా అగ్నిపథ్ వాయు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు..

మన్ననూర్, మే 16 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆర్ఐటీఐలో 2024-05-2026 విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు గిరిజన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ విజయమ్మ తెలిపారు. విద్యార్థులు ఆర్ ఐటీఐ తెలంగాణ వెబ్సైట్‌లో పదో తరగతి మెమోల్లో ఆధార్ కార్డులో తమ పేరను ఒకేలా ఉండేలా సరి చేసుకొని మొబైల్ నెంబర్లో అంతర్జాలంలో దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారందరూ అర్హులని వారు తెలిపారు. కులం, ఆదాయం, ఆధార్‌కార్డు పదో తరగతి మెమోలను దరఖాస్తులో జతపరచాల్సి ఉంటుందని చెప్పారు. మోటర్ మెకానిక్, ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్ కోర్సులు కళాశా లలో ఉంటాయని అన్నారు. రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థులకు కౌన్సెలింగ్లో సీట్ల ను కేటాయిస్తామని తెలిపారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

రాజోలి, మే 16 : పొలం కౌలు విషయంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలోని పెద్దధన్వాడలో జరిగింది. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చలిమెట్ల మహేష్ గత కొంత కాలంగా కర్నూలు జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొనితెర్ల గ్రామంలో నివసిస్తున్నారు. ఆయనకు పెద్ద ధన్వాడ గ్రామంలో నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆ పొలాన్ని తనకు కౌలుకు ఇవ్వాలని మహేష్ చిన్నాన్న పెద్దశేశిరెడ్డి ఒత్తిడి చేస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద ఈ నెల 14న గ్రామంలో జరిగిన శుభకార్యానికి మహేష్ హాజరయ్యారు. అతడిపై చిన్నాన్న శేశిరెడ్డి, ఆయన కుమారులు వెంకటరమణ, వీరేష్‌లు కర్రలతో దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా, గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

ధరూరు, మే 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని పెద్దపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న(44) ఈ నెల మూడున హమాలీ పనికోసం గద్వాలకు వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు హరికృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన బోయ సర్దార్ నవారన్న (50) కూడా హమాలీ పని కోసం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

కల్వకుర్తి, మే 16 : కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఉదయం కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు 25 మంది ప్రయాణికులతో బయల్దేరింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని రాచలూరు గేటు సమీపంలో కొంతమంది బైకులపై వెళ్తున్న యువకులు డ్రైవర్ హారన్ కొట్టాడంటూ బస్సుపై దాడికి పాల్పడ్డారని ప్రయాణీకులు తెలిపారు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా, మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బస్సుపై యువకుల దాడితో ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని బాధితులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు డిమాండ్ చేశారు.

72 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ కావాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

▸▸ కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎస్ మోహన్ రావు



సల్కర్‌పేట్‌లో ఏకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్ రావు

గండీడ్, మే 16 : ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమకావాలని అడిషనల్ కలెక్టర్ ఎస్. మోహన్‌రావు అన్నారు. బుధవారం 'గండీడ్‌లో పడిన వర్షం' అనే కథనం ఆంధ్రజ్యోతిలో రావడం వల్ల గురువారం మండల పరిధిలోని సల్కర్‌పేట్, రంగారెడ్డిపల్లి వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు 72 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమకావాలని అన్నారు. రంగారెడ్డి పల్లి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం చేసి తరలించి వెంటనే రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, ఏపీఎం బాలకృష్ణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేసవి దుక్కులతో లాభాలు అనేకం

▸▸ ఈ ఏడాది 'లా నినో' ప్రభావం ▸▸ ఉమ్మడి జిల్లా అంతటా అధిక వర్షపాతం



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ (ఫైల్)

పాలమూరు, మే 16 : వేసవికాలంలో వ్యవసాయంలో వేసవి దుక్కులు దున్నటం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. ఈ ఏడాది 'లా నినో' ప్రభావంతో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం కో-ఆర్డినే టర్, జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ వివరిస్తున్నారు. అందుకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకోవాల్సి ఉంది. వేసవి దుక్కులు తప్పనిసరిగా చేసుకోవటం వల్ల రైతులకు అనేకలాభాలు పొందవచ్చన్నారు. వేసవి దుక్కులతో వర్షపునీరు బాగా భూమిలోకి ఇంకిపోయి కోశస్థదశలో ఉన్న, నిద్రావస్థలో ఉన్న పురుగులు, శిలీంద్రాలు సూర్యరశ్మికి గురై నశించుకుపోతాయి. కలుపు ఉధృతి పంటకాలంలో తగ్గుతుంది. రైతులు సోయింగ్ రూల్‌ను కచ్చితంగా పాటించాలి. సాలుపడే వాన పడినప్పుడే విత్తుకోవాలన్నారు. నల్లనేలల్లో అయితే 60నుంచి 70మిల్లీమీటర్ల వర్షపాతం, ఎర్ర నేలల్లో 50, 60 మిల్లీమీటర్ల వర్షపాతం పడే వరకు విత్తుకోవాలన్నారు. దాంతో మొలకశాతం, మొలకెత్తిన 15నుంచి 20 రోజుల వరకు వర్షాభావం ఉన్నా పంట నిలదొక్కుకుంటుందన్నారు. వర్షాధారం కింద ముఖ్యంగా మొక్క జొన్న రైతులు కందిని అంతర పంటగా సాగుచేసుకోవాలన్నారు. దానివల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు మొక్కజొన్న సాధారణ దిగుబడిని ఇవ్వకపోయినా కంది పంట దిగుబడిని బాగా తీయవచ్చన్నారు. రైతులు కందిని అచ్చు పద్ధతిలో విత్తుకో వటం వల్ల విత్తనమోతాదును తగ్గించి మొక్క ఎదుగుదల పెరిగి దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. మాగాణుల్లో వరి పండించే రైతులు మే, జూన్ నెలల్లో సాగుచేసుకోవాలి. పచ్చరొట్ట పైర్లు అయినటువంటి జీలుగ, జనుము, పెసరజాతికి సంబంధించినవి వేసుకోవాలి. నాట్లు పెట్టే ముందు వీటిని 45రోజులతో (పూతకు ముందు) పొలంలో కలియదున్ని దమ్ము చేసుకుంటే భూసారం పెరిగి నేలల్లో క్షార స్వభావాన్ని తగ్గించి మనం అందించిన ఎరువులను వరి పొలానికి సమగ్రవంతంగా అందించగలం. అందువల్ల సూటి ఎరువులు వాడకం తగ్గుతుంది. పత్తిరైతులు, మొక్కజొన్న రైతులు కొనుగోలు దారుల వద్ద సరైన రశీదును పొందాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నా రు. నమ్మకమైన కంపెనీ విత్తనాలనే కొనుగోలు చేసుకోవాలంటున్నారు.

సబ్సిడీపై పచ్చరొట్ట పైర్లు, జీలుగ విత్తనాలు

రైతులకు పచ్చరొట్ట, జీలుగ విత్తనాలను 60 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేయనుందని జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ వివరించారు. మే 15వ తేదీ నుంచి పచ్చరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారులను కలిసి సబ్సిడీపై పచ్చరొట్టను తీసుకోవాలన్నారు. భూసారం తగ్గకుండా ఉండేందుకు పచ్చరొట్ట వేయటంతోనే భూసారం పెంచుకోవచ్చన్నారు. వర్షాలు బాగా ఉండటంతో రైతులు దిగులు పడాల్సిన అవసరంలేదన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులు అందుబాటులో ఉన్నాయన్నారు.

కాల్వ పనులు త్వరగా పూర్తి చేయండి

- మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి



చేపట్టనున్న వరద కాల్వ నిర్మాణ పనుల కోసం సూచనలు చేస్తున్న కమిషనర్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 16 : వరదనీటి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని శివశక్తినగర్‌లో నిర్మాణంలో ఉన్న వరదనీటి కల్వ పనులను పరిశీలించారు. ఇప్పటికే ఎన్‌పీ సుబ్బారెడ్డి స్కూల్ నుంచి కొంత దూరం డ్రైయినేజీ నిర్మాణ పనులు చేట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వరదనీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మిగతా డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఎక్కడ వరదనీటి ప్రభావం ఉంటుందో అక్కడ వెంటనే పనులు చేట్టాలని సూచించారు. ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

వేసవి క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- నోడల్ అధికారి నాగ్య నాయక్



విద్యార్థులతో నాగ్యనాయక్

నవాబ్‌పేట, మే 16 : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి నాగ్యనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు నెల రోజుల పాటు నిర్వహించే వేసవి క్రీడలతో దేహధారుడ్యం, ఇతర నైపుణ్యాలు పెం పొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ సాజిద్, శ్రీచరణ్, పీఈటీ గజానంద్ పాల్గొన్నారు.

హరితహారం ప్రణాళికలు సిద్ధం చేయండి

- నర్సరీలో మొక్కలు ఎండితే చర్యలు తప్పవు

- డీఆర్‌డీవో పీడీ నర్సింములు



దమాయపల్లి చెరువులో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ నర్సింములు

కోయిలకొండ, మే 16 : వచ్చే హరితహారం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీవో నర్సిములు సూచించారు. గురువారం మండలంలోని దమాయపల్లి, పారుపల్లి, చింతల్‌తండా, కోయిలకొండలో పర్యటించి నర్సరీలు, ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలలో మొక్కలు నీరు లేక ఎండిపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పారుపల్లిలో నర్సరీలో మొక్కల సంరక్షణ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే విత్తనాలు వెసి హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యే నాటికి మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దమాయపల్లి, చింతల్‌తండా నర్సరీల నిర్వహణపై కార్యదర్శి, ఉపాధి సిబ్బందిని అభినందించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాళప్ప, ఏపీవో నర్సయ్యతో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దాహం, ఆకలి తీర్చటానికి గొప్ప మనసు ఉండాలి

పాలమూరు, మే 16 : వేసవికాలంలో చలివేంద్రం, అంబలికేంద్రం ఏర్పాటు చేయటానికి గొప్పమనసు ఉండాలని క్రిస్టియన్‌పల్లి యువజన సంఘం నాయకులు అన్నారు. క్రిస్టియన్‌పల్లి 10వ వార్డులో ఎం.పీటర్ రెండు నెలల నుంచి వేసవికాలం సందర్భంగా చలివేంద్రం, అంబలి కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహం, ఆకలి తీర్చటంపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎం.పీటర్‌ను యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రోజు కూలీ చేసుకుని జీవించే వ్యక్తి అయినప్పటికీ నలుగురికి సహాయం చేయాలనే ఆలోచన, అలాంటి మనసు ఉండటం గొప్పదన్నారు. ఏప్రిల్ 1వ తేదీన మునిసిపల్ ఛైర్మన్ కె.ఆనంద్‌కుమార్‌గౌడ్ చేత చలివేంద్ర, అంబలికేంద్రం ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు వేణు, నగేష్, దీపు, యూత్ క్రిస్టియన్‌పల్లి, బీఎంబీ చర్చి వైస్‌ఛైర్మన్ చార్లెస్, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎంపీడీవో గీతాంజలి

మిడ్జిల్, మే 16 : గ్రామాలలోని తాగునీటి సమస్యల తలెత్తకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విలేకరులతో మాట్లాడారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే అసరమున్న చోట బోర్లు వేయించి పైప్‌లైన్‌లు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు అన్ని గ్రామాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతున్నామన్నారు. ప్రతీ నిత్యం గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేస్తున్నారని సమస్యలుంటే వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. దీంతో పాటు గ్రామాలలోని ఎప్పటికప్పుడు డ్రైనేజీలను, విధులను శుభ్రం చేయిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలోని ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే తమకు వివరిస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

'బీసీ రిజర్వేషన్లు పెంచాలి'

మిడ్జిల్, మే 16 : కాంగ్రెస్ పార్టీ నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీ కుల గణన జరిపించాలని బీసీ సేన మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి రామస్వామి కోరారు. గురువారం జడ్చర్ల పట్టణంలోని బీసీ సేన కార్యాలయంలో బీసీసేన నాయకులు సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్లకు తక్షణమే నిధులు కేటాయించి చేతివృత్తుల వారికి 100శాతం రాయితీతో రూ. 2లక్షల నగదును అందించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీసేన నాయకులు గోపాల్, శివరాములు, వెంకటేష్, కావలి రాములు, నరేందర్ యాదవ్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు, రేపు వాసవీమాత జయంత్యుత్సవాలు

మిడ్జిల్, మే 16 : జడ్చర్ల పట్టణంలోని శ్రీ వాసవీవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 17, 18వ తేదీలలో ఆవోపా ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వాసవీమాత దేవాలయం అధ్యక్షుడు దాచేపల్లి చంద్రయ్య, ఆవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ గురువారం తెలిపారు. మొదటిరోజు ఉదయం 8గంటలకు మహాగణపతి పూజ, సర్వతోభద్రమంటప, యోగినిమంటప, నవగ్రహాల పూజలు, ఉదయం 9:30 గంటలకు చండీయాగం, సాయంత్రం 5:30 గంటలకు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సహస్రదీపాలంకరణ, సేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాలతో పాటు పలు పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వాసవి జయంతి ఉత్సవాల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, వాసవీమాత భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

అన్నిరకాల ధాన్యానికి

బోనస్ ఇవ్వాలి



మహబూబ్‌నగర్ పట్టణం తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- సన్నాలకే ఇస్తామనడం సరికాదు

- తెలంగాణ చౌరస్తాలో జరిగిన ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, మే 16 : రైతులను కాంగ్రెస్ వంచిస్తోందని, రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పనిచేయదన్న విషయం స్పష్టమైందని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. వరి సన్నాలకే బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గోపాల్‌యాదవ్, కొండ లక్ష్మయ్య మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ అధికారులతో జరిపిన సమీక్షలో సన్నరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు ధాన్యంపై రూ.500 బోనస్ అని చెప్పి ఇప్పుడు సన్నాలకే అనడం రైతులను మోసం చేయడమేనని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని అన్ని రకాల వరిధాన్యంపై బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముందునుంచి కాంగ్రెస్ రైతువ్యతిరేకంగా పాలన సాగిస్తుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు అధికారం చేపట్టి ఆరునెలలైనా అమలుచేయలేదని, ఇప్పుడు ఆగస్టు 15 అని చెప్పడం సరికాదన్నారు. రైతుభరోసా కింద ఎన్నికల్లో చెప్పిన విధంగా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా రైతు వ్యతిరేక ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని విమర్శిం చారు. కరెంట్ సమస్యలతో ఇప్పటికే జిల్లాలో పెద్దఎత్తున పంట ఎండిపోయిందని, పండిన కొద్దిపంటకు కూడా కొనలేక కల్లాల్లోనే మగ్గుతున్నాయని, ధాన్యానికి గిట్టుబాటు కూడా లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నదని, పండిన ప్రతిగింజను కల్లాల్లోనే గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేసిందని నాయకులు గుర్తు చేశారు. రైతు వ్యతిరేక విధానాలు తీసుకుంటే బీఆర్‌ఎస్ రైతుల పక్షాన పెద్దఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంజి ఎంకన్న కోరమోని నర్సింహులు, కోరమోని వెంకటయ్య, శివరాజు, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్ గౌడ్, నరేందర్, గణేష్, గిరిధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, అహ్మదుద్దీన్, జంబులయ్య, నవకాంత్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

దేవరకద్ర : రైతులు కష్టపడి పండించిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ దగ్గర బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు , కర్నం రాజు, బాలరాజు, కొండారెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు, యువకులు పాల్గొన్నారు.



దేవరకద్ర తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

హామీలన్నీ నెరవేర్చాలి

- తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు

మిడ్జిల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని జడ్పీవైస్ ఛైర్మన్ యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, రామ్మోహన్, ప్రణీల్‌చందర్, బాదేపల్లి రంజిత్‌బాబు, శ్రీకాంత్, ఇమ్ము, శంకర్‌నాయక్, బాలరాజు, నాగిరెడ్డి, పరమటయ్య, విజయ్ ఉన్నారు.

అన్ని రకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలి

బాలానగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుంటే రైతుల తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

- వెబెక్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ జి. రవి నాయక్



వెబెక్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవి నాయక్

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), మే 16 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన వసతులకు సంబంధిత పనులను త్వరతగతిన పూర్తిచేయాలని కలెక్టర్ జి. రవి నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి వెబెక్స్ ద్వారా ఎంపీడీవోలు, ఎంఈవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఏపీఎంలు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ స్కూల్ హెడ్ మాస్టర్లతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పేయింటింగ్, మేజర్ మైనర్ మరమ్మతులు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని చెప్పారు. ఈ పాఠశాలల కింద చేపట్టే పనులు మండలాల వారీగా సమీక్షిస్తూ ఇంకా పనులు మొదలు పెట్టని పాఠశాలల్లో వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి 25 శాతం నిధులు ఎంపీడీవోలకు విడుదల చేసినట్లు తెలిపారు. వారి ద్వారా వీవోలకు చేరతాయన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందు పనులను పూర్తి చేయాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పనులకు సంబంధించి మెటీరియల్ ప్రొక్యూర్ చేసుకోవాలని, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ యూనిఫాం క్లాత్ ఈ నెల 18న వస్తుందని, ఎంఈవోలు మండలంలో గుర్తించిన మహిళా సంఘాల ద్వారా కుట్టించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, డీఆర్డీవో నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు



మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మహమ్మదాబాద్, మే 16 : విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు అన్నారు. గురువారం మహమ్మదాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించారు అధికారుల, సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ తిరుపతయ్య, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌లతో మాట్లాడారు. కార్యాలయ సిబ్బంది తీరుపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సందర్భంగా మహమ్మదాబాద్‌లోని ఎల్లమ్మదేవాలం సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు సమస్యలు పరిష్కరించాలని వనతి పత్రం అందజేశారు. అంతకుముందు మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

హన్వాడ : తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను గరువారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తనిఖీ చేసిన చేశారు. డీఆర్ బుక్‌ను పరిశీలించి బుక్‌ను నిర్వహించే విధానాన్ని వివరించారు. ప్రతీ ఫైల్‌ను జాగ్రత్తగా ఉంచాలని తెలిపారు. రికార్డులన్ని ఒక పద్ధతిలో ఉంచి భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సాదిక్ పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ నరేష్ చంద్ర



గండీడ్‌లోఅవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

నవాబ్‌పేట/ గండీడ్/ హన్వాడ/ మిడ్జిల్, మే 16 : ప్రజలు డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని నవాబ్‌పేట మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్ చంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గండీడ్, హన్వాడ, మిడ్జిల్ మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వ హించారు. మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి డెంగీ నివారణపై అవగాహన సదస్సు, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రజలు వర్షాకాలంలో డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకో వడంతో పాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గండీడ్ వైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని అన్నారు. కార్యక్రమంలో రాములు, బాలమ్మ, శరభలింగం, శ్రీనివాస్, అవినాష్, రజిత, రాఘవేందర్, వినోద్, వాహబ్, పుష్ప, ఇందిర, రాములమ్మ, శకుంతల, సువార్తమ్మ, వివిధ గ్రామాల ఆశ కర్యకర్తలు, గండీడ్‌లో సీహెచ్‌వో రాములు, సూపర్ వైజర్‌లు శాంతమ్మ, అంబదాస్ వైద్య సిబ్బంది గోపాల్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, 108 సిబ్బంది అక్బర్, హన్వాడలో వైద్యులు ప్రగతి, చతుర్వేది, సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఆశ వర్కర్లు, మిడ్జిల్‌లో డాక్టర్ శివకాంత్, సీహెచ్‌వో రాము, సూపర్‌వైజర్ మరియమ్మ ఉన్నారు.



నవాబ్‌పేట : ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ నరేష్ చంద్ర, వైద్య సిబ్బంది

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

హన్వాడ, మే 16 : గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. నాగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హన్వాడలో మల్టీపర్పస్ కార్మికులకు యూనియన్ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను ఎక్కువ పని గంటలు పని చేస్తున్నారని వేతనం మత్రం తక్కువ ఇస్తున్నారని, దీనిపై ప్రభుత్వం ఆలోచించి వేతనం పెంచాలన్నారు. గత ఆరు నెలల నుంచి వేతనాలు రాలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికులకు కిట్లు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మండల, గ్రామ స్థాయిలో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని, అధికారులు స్పందించకుంటే రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదులు చేద్దామని వారు అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలకృష్ణ, శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

ముత్యాలంపల్లిలో హనుమాన్ చాలీసా పారాయణం

భూత్పూర్, మే 16 : మండలంలోని పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని ముత్యాలంపల్లి గ్రామంలో సీతారామాశ్రమంలో రెండు రోజుల నుంచి ఘనంగా హనుమాన్ చాలిషా, భగవద్గీత పారాయణం, సామూహిక హోమాలు వంటి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు భగవద్గీత పారాయణం ప్రాముఖ్యత గురించి భక్తులకు వివరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లుగా ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు, భక్తులు, పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

మహబూబ్‌నగర్ టౌన్, మే 16 : నేడు (శుక్రవారం) సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ ఆర్.యం. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఫోను ద్వారా సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రయాణికులు ఇచ్చిన సూచనలు నమోదు చేసుకొని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు 9959226295 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, మే 16 : మహబూబ్‌నగర్ పట్టణంలో శుక్రవారం 11కేవీ శ్రీనివాసకాలనీ, పద్మావతికాలనీ ఫీడర్, 11 పద్మావతి కాలనీ ఫీడర్ నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నట్లు సెక్షన్-3 ఏఈ భగవంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మావతికాలనీశ్రీనివాసకాలనీ, అయ్యప్పగుట్ట ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు విద్యుత్‌కోత విధిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకారం అందజేయగలరని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవాబ్‌పేట, మే 16 : మండలంలోని పోమాల్, కొల్లూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని కేశవవుపల్లి, భట్టోనిపల్లితండా, సత్రోనిపల్లి తండా, చౌడూర్, రంగంపల్లి, దేపల్లి, కాకర్జాల తండా, జంగమయ్యపల్లి, పోమాల, కామారం పుట్టోనిపల్లితండా, అమ్మాపూర్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు ఏఈ టి.సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ నుంచి వచ్చే 33 కేవీని మరమ్మతులు చేయడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఈ అంతరాయానికి మండలంలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, మే 16 : మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు విక్రయించడానికి దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతోంది. వేలం ధరలో పెద్ద సోనా ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ. 2382, కనిష్ఠంగా రూ. 2243, పెద్దసోనా 186 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

'యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

పాలమూరు, మే 16 : 40 ఏళ్ల నుంచి స్కూల్ స్వీపర్‌గా పనిచేస్తున్న యాదయ్య ఈ నెల 12వ తేదీన అకస్మాత్తుగా మరణించాడు. యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్కూల్ స్వీపర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో యాదయ్య సంతాప సభ ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఏళ్లతరబడి స్కూల్ స్వీపర్‌గా పని చేస్తున్న యాదయ్య అకస్మాత్తుగా మరణించటంతో ఆయన కుటుంబం వీధినపడిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం స్కూల్ స్వీపర్లను పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా పట్టించుకొని పరిష్కరించాలని కోరారు. యాదయ్యకు ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనంతో పాటు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, రాములు, జమీల్, బాష, నరసింహులు, శ్రీనివాసులు, భాస్కర్, భీమమ్మ, ఆంజనేయులు, రామస్వామి, వెంకటయ్య, భరత్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై ఆటోవాలా దాడి

- బంగారు ఆభరణాలు అపహరణ

నవాబ్‌పేట, మే 16: జిల్లా కేంద్రం నుంచి బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఓ మహిళపై ఆటోవాలా దాడి చేసి ఆభరణాలు అపహరించిన సంఘటన మండలంలోని యన్మనగండ్ల శివారులో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ జిల్లా కేంద్రంలో నవాబ్‌పేట వైపు వస్తున్న ఆటోవాలను తనను నవాబ్‌పేటలో వదలాలని కోరగా ఆమెను ఎక్కించుకుని యన్మనగండ్ల శివారులోని గద్దగుండువద్ద ఆటోలో ఉన్న మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చి ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించాడు. ఆమె అక్కడే కూర్చొని రోదిస్తుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ అభిషేక్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పరిశీలించారు. ఆచూకీ దొరకలేదు. శుక్రవారం తనిఖీ వేగవంతం చేయనున్నట్లు తెలిసింది. ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

బాలానగర్, మే 16 : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై జనుము విత్తనాలు పరఫరా చేస్తుందని ఏవో ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూములలో జనుము పాగు చేయడం వలన సేంద్రియ కర్బనం ఏర్పడి పంటలు తెగుళ్లబారీన పడకుండా ఉంటాయని అన్నారు. అవసరం ఉన్న రైతులు మండలంలో ఉన్న వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.